


కేశవరం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి- కడియం

డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వంద శాతం కేంద్రం నిధులతో వీటిని నిర్మించనున్నారు. స్థల సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సివుంటుంది. మండపేట మండలం కేశవరంతో పాటూ జెడ్.మేడపాడులోనూ ఆర్‌ఒబిలను నిర్మించనున్నారు. కేశవరంలో రైల్లే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర కృషి చేశారు. గురువారం కేశవరం, జెడ్.మేడపాడుల్లో ఆర్‌ఒబిల నిర్మాణ స్థలాలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పరిశీలన చేశారు. వారి వెంట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, రామచంద్రపురం ఆర్‌డిఒ సుధాసాగర్, మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.



తూర్పులో ఏచూరి అడుగుజాడ

సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణ వార్తతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు తల్లడిల్లారు. సిపిఎం శ్రేణులను విషాదంలోకి నెట్టేసింది. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆయన మరణించారు. ఆయన స్వస్థలం కాకినాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- ఉమ్మడి జిల్లాతో విడదీయరాని బంధం
- కాకినాడ ఆయన స్వస్థలం
- మృతితో జిల్లాలో విషాదం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

1952 ఆగస్టు 12న ఆయన చెన్నయ్‌లో జన్మించిన ఆయన, బాల్యం మొత్తం హైదరాబాద్‌లో గడిపారు. ఆయన తల్లిదండ్రులు మాత్రం కాకినాడలోనే ఉండేవారు. తండ్రి సర్వేశ్వర సోమయాజి ఎపిఎస్ ఆర్‌టిసిలో ఇంజినీర్‌గా ఉద్యోగం చేశారు. తల్లి కల్పకం ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. కాకినాడ కుళాయి చెరువు ఎదురుగా ఉన్న వీధిలో వారు నివాసం ఉండే వారు. సొంత ఇల్లు, భవనాలు ఉండేవి. ఏచూరి టవర్స్ పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో ఆయన తల్లి నివాసం ఉండేవారు. అప్పుడప్పుడు ఆయన కాకినాడలో తల్లి వద్దకు వస్తూండేవారు. జిల్లాలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

1988లో సాలిపేట బాలికల హైస్కూల్లో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర శిక్షణ తరగతులకు కాకినాడ వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిరోజులు పాటు ఇక్కడే ఉండి విద్యార్థులకు క్లాసులు బోధించారు. 1994 జూన్‌లో ఐడియల్ కాలేజీలో పది రోజులు పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతుల్లో జాతీయ అంతర్జాతీయ పరిస్థితులు బోధించడానికి మరోసారి వచ్చారు. 1996లో పెద్ద ఎత్తున వచ్చిన తుపానుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అతలాకుతలం అయ్యింది. ఈ సమయంలో ఆయన ఇతర ఎంపిలతో కలిసి వచ్చి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పడవపై తిరిగి పరిస్థితులను అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించారు.



2015న రాజమండ్రిలో జరిగిన సిపిఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో జిల్లా నాయకులతో ఏచూరి

2008 ఆగస్టు 31 న కాకినాడ కచేరిపేట సుందరయ్య భవన్‌ను ఆయనే ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం శ్రేణులు సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి ఆయన్ను ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా తీసుకొచ్చారు. సుందరయ్య భవన్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సభలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రచురించిన సావనీర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయ సభలో ఏచూరితో పాటూ మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ప్రస్తుత సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కెఎస్ శ్రీనివాస్, ప్రస్తుతం సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెక్లారిన్ హైస్కూల్‌లో రాష్ట్ర తోలు బొమ్మలాట ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. రాజ్యసభ స్టాండింగ్ కమిటీ మెంబర్ గా ఉత్సవాలు ప్రారంభించారు. గాంధీభవన్‌లో ఒక లైబ్రరీ రూమ్ నిర్మాణానికి రూ.10 లక్షలు రాజ్యసభ నిధులను మంజూరు చేశారు. అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం 2015 డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించిన సిపిఎం రాష్ట్ర ప్లీనంలో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో సుబ్రహ్మణ్యం మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో తెలుగులో మాట్లాడి ప్రజలను చైతన్య పరిచారు. ఈ మూడురోజులు రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. శ్యామల సెంటర్లోని బాలాజీ దాస్ విగ్రహానికి నివాళు లర్పించారు. జిల్లాలో ఆయన చివరిసారి పర్యటన.



కార్మిక నేత బాలాజీదాస్‌కు జననేత ఏచూరి నివాళి



ప్లీనం సమయంలో సిపిఎం సీనియర్ నాయకులతో...



ఓపెన్ టాప్ జీప్‌లో ర్యాలీగా వస్తూ...



కాకినాడలో సుందరయ్యభవన్ ప్రారంభోత్సవంలో...

ఆప్యాయంగా పలుకరించేవారు



సీతారాం ఏచూరి కాకినాడ వచ్చినప్పుడల్లా అందరినీ ఆప్యాయంగా పలకరించి వెళ్లేవారు. నాకు ఆయనతో చాలా అనుబంధం ఉంది. ఏచూరి టవర్స్‌కు నేను 20 ఏళ్లుగా సెక్రెటరీగా పనిచేస్తున్నాను. ఆమె తల్లి రెండో అంతస్తులో నివాసం ఉండేవారు. అంతకుముందు ఈ అపార్ట్‌మెంట్ స్థానంలో జోడు ఏనుగుల భవనం ఉండేది. ఆయన తండ్రి సోమయాజి, తల్లి ఇక్కడే ఉండేవారు. సీతారాం ఏచూరి ఇక్కడికి వచ్చినప్పుడల్లా పేరుపేరునా అందర్నీ పలకరించి వెళ్లేవారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులతో కూడా అనుబంధం ఉంది.

- వరదరాజు, ఏచూరి టవర్స్ సెక్రటరీ, కాకినాడ



రాజమహేంద్రవరంలోని సిపిఎం కార్యాలయంలో సీతారాంఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ శ్యామల సెంటర్లోని సిపిఎం కార్యాలయంలో గురువారం జరిగింది. ఏచూరి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడారు. పార్టీ నిర్మాణంలో సైద్ధాంతిక పాత్ర పోషించిన పోరాట యోధుడు ఏచూరి అని అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, రాజ్యాంగంపైన విస్తృత దాడి జరుగుతున్న ఈ తరుణంలో సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని అన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి ఆయన ప్రస్థానం ప్రారంభమైందన్నారు. జెఎన్‌యులో మూడుసార్లు విద్యార్థి సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారన్నారు. ఎమర్జెన్సీ కాలంలోనూ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధానాలను వ్యతిరేకించి పోరాటాలు నడిపించిన మహా యోధుడు అని తెలిపారు. రష్యాలో ప్రతికూల పరిస్థితి ఏర్పడిన కాలంలోనూ సిపిఎం అఖిలభారత 14వ మహాసభలో సోషలిజం అజేయం అనే తీర్మానాన్ని రూపొందించి సైద్ధాంతిక పునాదిని మరింత బలోపేతం చేశారని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న సరళీకరణ, ఆర్థిక విధానాలు, వాటి వల్ల జరిగే నష్టాలను తన వ్యాసాల ద్వారా ప్రజలను చైతన్యపరిచారన్నారు. 2015 డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహించిన పార్టీ రాష్ట్ర ప్లీనంలో పాల్గొన్నారని తెలిపారు. సుబ్రహ్మణ్యం మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో తెలుగులో మాట్లాడి ప్రజలను చైతన్యపరిచారని గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఏచూరి ప్రసంగాలు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉండేవన్నారు. పార్లమెంటులోనూ, వెలుపల ఆయన రాజకీయ ఉపన్యాసాలు ప్రతిపక్ష నేతలు సైతం ఆసక్తిగా ఆలకించే వారిని తెలిపారు. ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం వంటివి ఏర్పాటులో ఏచూరి కీలక భూమిక పోషించారన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంస్మరణ సభకు సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ అధ్యక్షత వహించారు. ఈ సభలో పార్టీ నాయకులు ఎస్ఎస్.మూర్తి, కెఎస్‌వి.రామచంద్రవరావు, ఎం.సుందర్‌బాబు, తులసి, సావిత్రి, రాజ్ కుమార్, ప్యారి, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, మురళి, సావిత్రి, రాంబాబు, సిపిఐ నాయకులు వి.కొండలరావు, కె.రాంబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



2015 రాజమండ్రి సుబ్రహ్మణ్యం మైదానంలో...

వరద బాధితులకు పలువురి సాయం

ప్రజాశక్తి- కడియం

వరద బాధితులకు అండగా నర్సరీ రైతులు, టిడిపి శ్రేణులు నిలిచాయి . నర్సరీ అసోసియేషన్ తరపున రూ.50 వేలు, గట్టి సుబ్బారావు అండ్ అదర్స్ రూ.1.25 లక్షలు, మార్గాని సోదరులు రూ.1లక్ష, పుల్లా చంటియ్య, బొర్సు సుబ్బారాయుడు, విశ్వేశ్వర హైటెక్ నర్సరీ, పుల్లా అబ్బులు, మల్లు పోలరాజు ఒక్కొక్కరు రూ.25 వేలు అందించారు. మొత్తంగా రూ.4 లక్షల చెక్‌లను రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నర్సరీ రైతులు పాల్గొన్నారు. బుధవారం పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు తరఫున ఆయన కుమారులు రూ.3 లక్షల చెక్‌ను ఇప్పటికే అందించారు. మురమండ గ్రామంలో టిడిపి పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన రూ.11,00,500లను ఎంఎల్ఎకు అందించారు. కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ రూ.లక్ష, మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి రూ.25 వేలను అందించారు. దాతలను ఎంఎల్ఎ గోరంట్ల అభినందించారు.

విజిలెన్స్ కమిటీ సభ్యునిగా భావన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో కానూరు గ్రామ సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ కొవ్వూరు డివిజన్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా నియమించినట్టు కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. ఈ మేరకు 12న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధు పూర్ణచంద్ మాట్లాడుతూ పూర్తి నిబద్ధతో సేవలందిస్తానన్నారు.

కేంద్రం గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేదు

పిసిసి అధ్యక్షురాలు షర్మిల

ప్రజాశక్తి - రాజానగరం

వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం గుక్కెడు నీళ్లను కూడా అందిచలేకపోయిందని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. కాకినాడ జిల్లాలో ఏలేరు వరద ముంపు ప్రాంతాలను ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం రాజానగరంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ విజయవాడ నుంచి కోట్లాది రూపాయాల ఆదాయం చేకూరుతుందన్నారు. కాని ఇక్కడ వరద బాధితులకు గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేకపోయిందన విమర్శించారు. వరదల వల్ల రాష్ట్రంలో 6 లక్షల ఎకరాలకు పంటనష్టం వాటిల్లినట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఒకొక్క ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏలేరు రిజర్వాయర్ సరైన నిర్వహణ, ఆధునికీకరన చేపట్టక పోవడం వల్లే నేడు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ



విషయంలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. బాధితులకు మంచినీళ్లు కూడా అందించలేని బిజెపి ప్రభుత్వంతో టిడిపి కూటమి కట్టిందంటే ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఆమె వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్రీనివాస్, మండలం అధ్యక్షుడు ముప్పిడి శ్రీను, పిసిసి రాష్ట్ర కార్యదర్శి అరిగెల అరుణకుమారి, డాక్టర్ వడియార్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతాహి సేవా'ను జయప్రదం చేయాలి

పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 'స్వచ్ఛతాహి సేవా- 2024' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. అంతకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ "స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం అమలుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2వరకూ క్షేత్ర స్థాయిలో అమలుచేసే కార్యక్రమాలపై నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, అమలు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం నిర్దేశించిన మూడు అంశాలతో కూడిన విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందన్నారు. మొదటిగా పరిశుభ్రత లక్ష్య యూనిట్లు- శ్రమదాన్ కార్యకలాపాలు లక్ష్యలని నిర్దేశించుకుని కాలపరిమితితో కూడిన మార్పు, సాధారణ శుభ్రత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రెండవ అంశంగా ప్రజల భాగస్వామ్యం, అవగాహన, సహేతుకమైన దిశగా అడుగులు వేయడం ద్వారా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. మూడో అంశంగా ముందస్తు ఆరోగ్య తనిఖీ, సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో కార్యక్రమాలను రూపొందించారు.

పరిశుభ్రత లక్ష్య సాధనకు బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, సంస్థాగత భవనాలు, వాణిజ్య, మార్కెట్ ప్రాంతాలు, విద్యా సంస్థలు, ప్రజా రవాణా కేంద్రాలు, ప్రధాన రహదారులు, రహదారులు, రైల్వే స్టేషనులు, రైలు పట్టాలు, అభయారణ్యాలు, జంతు ప్రదర్శనశాలలు, రక్షిత ప్రాంతాలు, ట్రెక్కింగ్, క్యాంపింగ్ సైట్లు, నీటి వనరులు (నదులు, సరస్సులు, చెరువులు, కాలువలు మొదలైనవి), పర్యాటక ప్రదేశాలు, మతపరమైన ఆధ్యాత్మిక ప్రదేశాలు, వారసత్వ సంపద ప్రదేశాలను శుభ్రపరచడం, వాటిని సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. దీని కోసం స్వచ్ఛతాహి ప్రతిజ్ఞలు, వర్క్‌షాపులు, ర్యాలీలు, గ్రామసభలు వంటివి నిర్వహించాలన్నారు.

ఆరోగ్య , సామాజిక భద్రత కల్పించడం కోసం సింగిల్ విండో విధానం లో క్యాంపులు - ఆరోగ్య తనిఖీ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం తో సామాజిక రక్షణకు ప్రాప్యతను మెరుగుపరచడానికి సంక్షేమ పథకాలకు అనుసంధానం చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన, ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్, మరుగుదొడ్లు, విద్యుత్, అమత్ జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ , పిఎం సౌభాగ్య , ప్రధానమంత్రి జన్ ధన్ యోజన , బ్యాంకింగ్ ద్వారా ఋణ సౌకర్యం, ఉజ్వల్ ద్వారా ఎల్ పి జి కనెక్షన్ , ఆరోగ్య బీమా కుటుంబ భద్రత, ఆయుష్ మాన్ భారత్ రోగ నిరోధకత కోసం ఆరోగ్య పరిరక్షణ తదితర వేథకాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, డిపిఒ డి.రాంబాబు, సిపిఒ ఎల్.అప్పాలకొండ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, డి.బాలశంకర రావు, డిఎంహెచ్ఒ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

కీర్తి చక్ర శ్రీనివాస్‌కు ఘన నివాళి

రాజమహేంద్రవరం : కీర్తి చక్ర అవార్డు గ్రహీత పందిళ్లపల్లి శ్రీనివాస్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు.స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, వృక్ష శాస్త్ర విభాగం సంయుక్తంగా శ్రీనివాస్ 70వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామంచంద్రరావు మాట్లాడారు. తమ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో విద్యనభ్యసించి ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా కర్ణాటక, తమిళనాడు అటవీ ప్రాంతాల్లో ఆయన పనిచేశారన్నారు. వీరప్పన్‌ను ధైర్యంగా ఎదుర్కొని అరెస్ట్ చేయడంలో కీలక భూమిక పోషించారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... శ్రీనివాస్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలన్నారు. ఫారెస్ట్ అధికారులు ఈ.హారిక, శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ట్రైనింగ్ సందర్భంగా ముస్సోరి, డెహ్రాడూన్‌లో ఉన్నప్పుడు శ్రీనివాస్ విధి నిర్వహణ, సేవా నిరతి గురించి అనేక విషయాలు నేర్చుకున్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ శ్రీనివాస్ లాంటి విద్యార్థి ఇక్కడ చదవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధిపతి శ్రీనివాస్, పందిళ్ళపల్లి శ్రీనివాస్ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీలపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

తాళ్లపూడి : ప్రజా సమస్యలు అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సకాలంలో అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకూ నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆమె వెంట తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ ఉన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

గోపాలపురం : గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ గురువారం నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో పోటీలు జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు రొంగల హేమలత, అచ్చియ్య, కామాక్షి, భూదేవి, సీతారాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం : మండల కేంద్రం ఉండ్రాజవరం 11 కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్, అభివృద్ధి పనుల నిర్వహణ నిమిత్తం ఉండ్రాజవరం, హెడ్ క్వార్టర్, సత్యవాడ, చిలకపాడు, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపేస్తామని విద్యుత్ శాఖ ఎఇ ఎన్.దొరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. వ్యవసాయ, 3 ఫేస్ విద్యుత్ ఉదయం 6 గంటల నుండి 9 గంటలు, తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు సరఫరా చేస్తామన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం


రాజమహేంద్రవరం : విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగడానికి పౌష్టికాహారం ఎంతో అవసరం అని లాలా చెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మ్యాజిక్ బస్సు ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మ్యాజిక్ బస్సు సంస్థ ప్రతినిధి దివ్య మాట్లాడుతూ ఆరోగ్యానికి కావాల్సిన పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటేనే విద్యార్థులు చక్కగా చదువుకోగలుగుతారన్నారు. శరీరానికి సరైన వ్యాయామం కూడా అవసరమని దివ్య తెలిపారు. మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో పోషక విలువల వివరాలు తెలిపే చార్ట్‌లను విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మేజిక్ బస్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి - పెరవలి

మండలం గోదావరి వరదల వల్ల ముంపునకు గురైన కానూరు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి తదితర గ్రామాల్లో అరటి, కూరగాయల పంటలను కొవ్వూరు ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. నష్టంపై అంచనాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

కార్టూ'నిజం'



యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయకర్ అన్నారు. స్వర్ణోత్సవ వేడుకలు సందర్భంగా జయకర్ గురువారం తాళ్లపూడి మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సిపిఎస్‌తో పాటు జిఒ 117ను రద్దు చేసేలా చూడాలని, ఉపాధ్యాయులకు మంత్లీ ప్రమోషన్లు ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ సమస్యలను సంఘం తరుపున జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వారికి తెలిపారు. ఆయన వెంట మండల గౌరవాధ్యక్షురాలు రాజకుమారి, అధ్యక్షులు క్రాంతికుమార్, కార్యదర్శి విజయబాబు, మహిళా శాఖ అధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా సభ్యులు శ్రీనివాస్, మనోజ్, ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, లక్ష్మయ్య, పుల్లారావు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో సుందరబాబు

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

ప్రజాశక్తి - దేవరపల్లి

విజయవాడ వరద బాధితుల కోసం గురువారం దేవరపల్లిలో బియ్యం సేకరణ కార్యక్రమాన్ని జనసేన గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. జన సైనికులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి బియ్యాన్ని సేకరించారు. నియోజక వర్గంలో 20 టన్నుల బియ్యాన్ని సేకరించినట్లు సువర్ణరాజు తెలిపారు. సేకరించిన బియ్యాన్ని జనసేన పార్టీ మంగళగిరి కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చప్పటి శివ, మాధవరపు వెంకటేశ్వరరావు, గంట సురేష్, ఆకుల నాని, శ్రీను ,రమేష్ జన సైనికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ కె.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లజర్ల మండలం చాదరాసికుంటలో అంగన్‌వాడీ కార్యకర్త (ఒసి1), ఆయాలకు సంబంధించి గోపాలపురం మండలం గంగోలు పంచాయతీ హుకుంపేటలో -1 (ఒసి), వేలచింతలగూడెం-1(బి సి-ఎ), దేవరపల్లి మండలం యర్నగూడెం1(ఒసి), గౌరీపట్నం1 (ఒసి), నల్లజర్ల మండలం చాదరాసికుంట1(బిసి-బి), నభీపేట1(ఎస్‌సి), నల్లజర్ల(ఒసి) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన స్థానిక వివాహిత మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి సిడిపిఒ కార్యాలయంలో ఈ నెల 20 లోగా అందించాలన్నారు.

పెరవలి : పెరవలి ఐసిడిసి ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని అంగ్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి తెలిపారు. తిమ్మరాజుపాలెం-1(ఒసి), జీడిగుంట -1ఎస్‌సి, కాటకోటేశ్వరం- 1(ఒసి), నడిపల్లి-1(బిసి-డి), అన్నవరప్పాడు-1(ఒసి), 1(బిసి-ఇ), దమ్మెన్ను-1(ఎస్‌సి), మోర్త-1(ఒసి), ఉనకరమల్లి-1(బిసి-డి), పసలపూడి-1(బిసి-ఎ), తాడిపర్రు-1(ఒసి)లకు కేటాయించారన్నారు. దరఖాస్తులను స్థానిక వివాహిత మహిళలు పదవ తరగతి అర్హత కలిగిన వారు సంబంధిత ధ్రువపత్రాలు 11వ తేదీ నుండి 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో స్వయంగా అందించాలన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావుపల్లి గ్రామ శివారున రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట పోలీసులు గురువారం దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,250లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ రిజర్వాయర్ నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ టి.రామకృష్ణ సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. వాటా చట్టప్రకారం నదీ గర్భంలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగించడం నేరమని,అక్రమ తవ్వకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో బాలునికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని కోరంగి పంచాయితీ సీతారాంపురం మరిడమ్మ గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన బాలుడు అంగాడి హర్షకుమార్ గాయాలయ్యాయి. రోడ్డుపై ఆడు కుంటుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న మల్లాడి వినయ్ వాహనం ఢీకొట్టింది. గాయపడిన బాలుడిని తాళ్ళరేవు సిహెచ్‌సికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని చిప్పలపాలెం నందు రాయుడు పాలెంకు చెందిన ఆటో డ్రైవర్ రమణాతి ఉమామహేశ్వరరావు (45) బుధవారం రాత్రి తన ఆటోలో అమలాపురం వైపు వెళుతుండగా ఆటో అదుపుతప్పి బొండాయికోడు కాలువలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావు మృతి చెందాడు. భర్త ఉమామహేశ్వరరావు రాత్రి ఎంతకు రాకపోవడంతో భార్య శ్రీలక్ష్మి ఫోన్ చేసినా స్పందించక పోవడంతో భర్త ఆచూకీ కొరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఆటో బోల్తా పడిన ఘటనలో ఉమా మహేశ్వర రావు మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా కేసులో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామ శివారున అదే గ్రామానికి చెందిన చాకలి మంగ సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు హెచ్‌సి అబ్బులుదొర సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.



వైఎస్ షర్మిల చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

డిసిసి అధ్యక్షునిగా కొండేటికి నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు గురువారం ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా షర్మిల ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ బలోపేతానికి కషి చేస్తానన్నారు. 2029 ఎన్నికల నాటికి కాంగ్రెస్ వాదులంతా ఒకే తాటిపై నిలబడి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కషి చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండలపరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండల పరిధిలో 11 కెవి ఫీడర్, పల్లంకూరు 11 కెవి ఫీడర్లలో ఓవర్ లోడ్ కారణంగా వర్క్, చెట్లు తొలగింపు పనులు చేపట్టడతారన్నారు. మండల వ్యాప్తంగా కాట్రేనికోన, వేట్లపాలెం, గచ్చకాయలపొర, సిరయానం, కొండ లేశ్వరం, గెద్దనాపల్లి, కొప్పిగుంట, దొంతుకూరు, పల్లం, కందికుప్పు, పల్లంకూరు, బలుసు తిప్ప, మొలేటిమొగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు.

న్యాయవాది పెట్టా అంబేద్కర్ వర్ధంతి

ప్రజాశక్తి అమలాపురం

స్థానిక డాబా గార్డెన్స్ లో న్యాయవాది పెట్టా అంబేద్కర్ నాలుగో వర్ధంతి కార్యక్రమం గురువారం ఆయన శిష్యులు గోసంగి బంగార్రాజు, దొండపాటి రాజారావు, రొక్కాల శ్రీనివాసరావు, కుసుమ శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. అంబాజీపేట మండలం ఇసుక పూడి 2024సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలు లో అత్యధిక మార్కులు సాధించిన నామాడి సూర్య తేజ కు పెట్టా అంబేద్కర్ మెమోరియల్ అవార్డు, మెమెంటో, నగదు డైరెక్ట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఐఎన్ మల్లేశ్వరరావు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్, న్యాయవాదులు, మట్టా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో కిడ్నీలో రాళ్లు తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉభయ గోదావరి జిల్లాల్లోనే మొదటిసారిగా ఎటువంటి కోత, కుట్లు లేకుండా అత్యాధునిక ఆర్ఐఆర్ఎస్ (రెట్రోగ్రేడ్ ఇంట్రారెనల్ సర్జరీ) ప్రక్రియ ద్వారా 11 నెలల బాలుడి కిడ్నీలో రాళ్లను తొలగించినట్లు కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. కాకినాడ జిల్లాకి చెందిన బాలుడికి గత కొన్నినెలలగా తీవ్రమైన జ్వరం, కడుపు నెప్పితో బాధ పడుతూ, మూత్రం పోయడంలో ఇబ్బంది పడుతుండగా గమనించిన తల్లిదండ్రులు పలు హాస్పిటల్స్‌ను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో చివరికి మెడికవర్ హాస్పిటల్‌కు రావడం జరిగిందన్నారు. ప్రముఖ యూరాలాజిస్ట్ డాక్టర్ కళ్యాణ్ బాబు, డాక్టర్ మణికంఠతో కూడిన వైద్య బృందం ఆ బాలుడికి అవసరమైన పరీక్షలు చేసి కిడ్నీలో రాళ్లు ఉన్నాయని నిర్ధారించి వెంటనే సర్జరీ చేసి ఆ రాళ్లను తొలగించాలని తల్లిదండ్రులకు చెప్పడం జరిగిందన్నారు. అత్యాధునిక ఆర్ఐఆర్ఎస్ ప్రక్రియ ద్వారా రాళ్లను తొలగించి బాబునిని మూడు రోజుల అనంతరం ఇంటికి పంపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ బాబు మాట్లాడుతూ పోషకాహార లోపం, అధిక ఉప్పు వాడకం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల భారతదేశంలో కిడ్నీ స్టోన్ వ్యాధి సాధారణం అయితే, ఈ వ్యాధి పిల్లల్లో సాధారణం కాదన్నారు. నవజాత శిశువులలో దీనిని కనుగొనడం చాలా అరుదు అని తెలిపారు. ఆర్ఐఆర్ఎస్ అనేది ఎండోస్కోపిక్ శస్త్రచికిత్స, ఇది మూత్ర నాళం నుంచి కిడ్నీకి చేరుకోవడానికి అనుమతిస్తుందన్నారు. ఈ రకమైన విధానాలకు అనువైన యూరిటెరోస్కోప్ ఉపయోగించబడుతుందని, ఈ పరికరం ద్వారా రాళ్లకు చికిత్స చేయడానికి లేజర్ ఫైబర్ (హోల్మియం లేజర్) ఉపయోగించబడుతుందన్నారు. దీని తర్వాత చిన్న చిన్న రాళ్లముక్కలను కూడా పూర్తిగా తొలగించవచ్చునన్నారు. ఈ ప్రక్రియలో ఎటువంటి కోతలు, కుట్లు ఉండవని, రక్తస్రావం కూడా జరగదన్నారు. అనస్థీషియాలజిస్ట్ డా.కిషోర్ మాట్లాడుతూ ఇది ఎంతో ఈ సంక్లిష్టమైన ప్రక్రియ అని, 11 నెలలు బిడ్డకు మత్తు ఇవ్వడంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ సుభాకర్ రావు మాట్లాడుతూ ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఆ బాబుకి ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అత్యాధునిక సదుపాయాలు, పరికరాలు, 24 గంటలూ అనుభవజ్ఞులైన డాక్టర్స్ కలిగిన మెడికవర్ హాస్పిటల్స్ ఇలాంటి ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు చేయడంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని తెలిపారు

ఏలేరు వరదను అరికట్టేలా చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని ఇర్రిపాక నుంచి కిర్లంపూడి మండలం ముక్కోలు గ్రామం వరకూ ఏలేరు వరదను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ కోరారు. గురువారం ఇర్రిపాక గ్రామంలో వరదతో కోతకు గురైయిన ఏటిగట్టును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో ప్రొటెక్షన్ వాల్స్ నిర్మించి పటిష్ఠ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ సీతారామారావు, ఇరిగేషన్ ఎఇ శేష గిరిరావు, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, అప్పన్న దొర, జ్యోతుల వీరభద్రరావు, కుంచె తాతాజీ పాల్గొన్నారు.



ఇర్రిపాకలో ఏటి గట్ల ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

రైతుల కోసం ఉదారంగా ముందుకు రావాలి

ప్రజాశక్తి - కాకినాడ

భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు బ్యాంకులు రుణాల రీషెడ్యూలింగ్, కొత్త రుణాల మంజూరుకు ఉదారంగా ముందుకు రావాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటీవ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత నెల 30 నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, అనంతరం ఎదురైన వరద ముంపు పరిస్థితులను కమిటీ సమీక్షించింది. ప్రకృతి వైపరీత్యం దృష్ట్యా నష్టపోయిన రైతులకు పంట రుణాలు రిషెడ్యూలింగ్, కొత్త రుణాల కల్పన చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. వరదల కారణంగా పంటలు, ఇతర రంగాలకు వాటిల్లిన నష్టాల గణన రేపటి నుంచి ప్రారంభమౌతుందని కలెక్టర్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఉపాధి అవినీతిపై రగడ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతిపై ఫీల్డ్ అసిసెంట్లకు, నేతలకు మధ్య వాగ్వాదం రగడగా మారింది. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. మూలపేట గ్రామంలో ప్రజలకు 1100 జాబు కార్డులు మంజూరు అయ్యాయని, కానీ 900 మందికి మాత్రమే అర్హత కల్పించారని, వీరిలో కేవలం 68 మందికి మాత్రమే పనులు కల్పించడాన్ని గ్రామస్తులు కంబాల వెంకటరమణ, మెరుగు సూరిబాబు, సిద్ధి నాగు, మెరుగు రాజారావు నిలదీశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెందిన బంధువులకు మాత్రమే పనులు కల్పించడాన్ని సభ దృష్టికి తెచ్చారు. పంచాయితీ గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తికి ఉపాధి పనులు కల్పించారని, జాబు కార్డు అర్హత లేని 10 మంది ఎస్సీలకు పనులు కల్పించారని, అయితే వారికి నేటికీ కూలి డబ్బులు ఇవ్వలేదని, పనులు కల్పించకుండానే మస్తర్లు వేస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పలు గ్రామాల్లో మొక్కలు నాటకుండా నాటినట్లు చూపించారని, మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి దొంగ మస్తర్లు వేసుకుని అవినీతికి పాల్పడ్డారని పలువురు అధికారుల వద్ద వాపోయారు. అభియోగాలు ఉన్నచోట చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఎపీడీ వసంతమాధవి, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రవిశంకర్, ఎంపిడిఒ వెంకటనారాయణ, ఇఒపిఆర్‌డి భాస్కరరావు పాల్గొన్నారు.



పనుల అవకతవకలపై వివరిస్తున్న మూలపేట గ్రామస్తులు

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన విద్యార్థిని ముచ్చుపల్లి భాగ్యలక్ష్మి విద్యకు అవసరమైన ఆర్థిక సాయాన్ని తిమ్మాపురం ఎఎస్ఐ బొల్లంరెడ్డి వీరవెంకట సత్యనారాయణ ఆర్థిక సాయాన్ని అందించినట్లు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయ గాయత్రి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ చదువుతున్న ఆ విద్యార్థిని ఆర్థిక పరిస్థితి బాగోలేదని కరప పూర్వ విద్యార్థుల సంఘం తరపున సాయం కోరిన వెంటనే స్పందించిన ఎఎస్ఐ మొదటి, రెండో ఏడాది ఫీజుల మొత్తం రూ.26 వేలను కళాశాల యాజమాన్యానికి చెల్లించారని తెలిపారు. విద్యార్థినికి అండగా నిలిచిన ఎఎస్ఐకి పూర్వపు విద్యార్థుల సంఘం కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ సీతారాంపురం ఎంపిపి పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఎంపిపి రాయుడు సునీత గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ.5 లక్షలతో కిచెన్ షెడ్ అభివృద్ధి, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం కె.ఝాన్సీలక్ష్మీకాంతం, ఎస్‌ఎంసి ఛైర్మన్ పిల్లి త్రిమూర్తులు, కూటమి నాయకులు రాయుడు గంగాధర్, టేకుమూడి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం ఎలుకల నిర్మూలన మందు పంపిణీచేశారు. **అమలాపురం రూరల్:** అమలాపురం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని రైతులందరికీ గురువారం ఉచితముగా ఎలుకల మందు పంపిణీ చేసి సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి, జనుపల్లి గ్రామాలలో నల్లమిల్లి గ్రామ సర్పంచ్ గోకరకొండ శ్రీనివాస్ అధ్యక్షతన ఎలుకల మందు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం ఎ షంసి మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ధర్మ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సందీప్, నవీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం**: రైతులు ఎలుకలను సామూహికంగా నిర్మూలించుకునేందుకు నివారణ మందు తయారు చేసుకుని విధానంపై గురువారం మండలంలోని 18 భరోసా కేంద్రాల వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల మందు కలిపిన ఎరను అందరి రైతులకు పంపిణీ చేశారు. **ఆలమూరు :** వరి సాగు రైతులు సామూహిక ఎలుకల నిర్మూలనతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిని ఎస్.లక్ష్మీ లావణ్య అన్నారు. మండలంలోని 18 గ్రామాలలో అన్ని రైతు సేవా కేంద్రాలవద్ద సామూహిక ఎలుకల నిర్మలన కార్యక్రమం గురువారం ఆమె వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా అధ్యక్షతన కూటమి నేతలు ఈదల సత్తిబాబు, ఈదల నల్లబాబు, విఆర్ఒ ప్రసాద్, ఎంపిఇఒ జస్వంత్, తదితరులు రైతులకు పంపిణీ చేశారు. **కపిలేశ్వరపురం:** పంట పొలాలు, ఉద్యాన పంట పండ్ల తోటల్లో పంట నష్టం నివారణకు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్ కుమార్ గురువారంతెలిపారు కపిలేశ్వరపురం మండలం లోని రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు ఎలుకల నివారణలో భాగంగా బ్రోమో డైయాలిన్ మందును ఉచితంగా అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉచిత ఎలుకల మందు పంపిణీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు .కార్యక్రమంలో వ్యవసాయ కమిషనరేట్ అబ్జర్వర్ గా డి. వెంకటేశ్వరరావు మాట్లాడారు కార్యక్రమంలో ఆత్మ పీడీ జ్యోతిర్మయి డాట్ సైంటిస్ట్ నందకిషోర్, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఎడిఎ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** కొత్తలంక రైతు క్షేత్రంలో ఎలుకల మందులను రైతులు వినియోగించే విధానాన్ని మండల వ్యవసాయ అధికారి ఎస్ ప్రశాంత్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో ఎలుకల మందు తయారీపై రైతులకు శిక్షణ

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-రామచంద్రపురం

15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ కీర్తి స్పందన తెలిపారు . రామచంద్రపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అంబటి భవాని అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్ఆర్‌జిఎస్ పనుల నిమిత్తం గుర్తించిన పనులకు మండల పరిషత్ సభ్యులు ఆమోదం కోసం సమావేశం ఏర్పాటు చేశామని, అన్ని పనులను పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి సలెట్ రాజు మాట్లాడుతూ ఈ నెల 17 నుండి అక్టోబర్ రెండో వరకు గ్రామాల పరిశుభ్రతపై దృష్టి సారించా లన్నారు. సమావేశంలో వేలంపాలెం సర్పంచ్ భర్త టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలంటే ఎలా సాధ్యమవుతుందన్నారు. సచివాలయాల్లో సిబ్బంది అధికంగా ఉన్నారని కొంద కొంతసిబ్బందిని తొలగించి వారి స్థానంలో పారిశుధ్య కార్మి కులను నియమి ంచుకునే విధంగా మండల పరిషత్ తీర్మానం చేయా లని సూచిం చారు. అనంతరం ఆయా గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ చట్టం పనుల్లో 1505 పనులకు రూ.69.43 కోట్లు వెచ్చించేందుకు మండల పరిషత్ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో ఎన్ఆర్‌జిఎస్ ఎపిఒ ఈశ్వరరావు, ఎఒ సుబ్రహ్మణ్యం, పలు గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ తదితరులు

నియోజకవర్గ రైస్ మిల్లర్స్ సంఘ అధ్యక్షునిగా పాపారావు

ప్రజాశక్తి-ఆలమూరు

కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షునిగా ఆలమూరుకు చెందిన మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 13న ఆలమూరు లో ఘనంగా నిర్వహిస్తారని ఆయన గురువారం విలేకరులకు తెలిపారు.

రెడ్డిపల్లిలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వాతి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - పెద్దాపురం, గండేపల్లి

జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి తనయుడు రేస్వంత్ రాయ్ పుట్టిన రోజును పురస్కరించుకుని నేడు మండలంలోని పులిమేరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. త్రినేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించబడుతుందన్నారు. పులిమేరు గ్రామంలోని వారే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గండేపల్లి గ్రామంలో సుంకవల్లి రమేష్ ఇంటి వద్ద రాజమహేంద్రవరంకు చెందిన గౌతమి నేత్రాలయం వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గోపి తెలిపారు. ఈ శిబిరం వద్ద కంటికి సంబంధించిన సమస్యలు గుర్తించి ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు, శస్త్రచికిత్స అవసరమైన వారిని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించడం జరుగుతుందని తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక పిహెచ్‌సిని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా సెంటర్స్ యొక్క రికార్డులను పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్స్ పనితీరును మెరుగుపర్చుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పూర్తి చేయాలని, రిపోర్టులను త్వరితగతిన నివేదించాలని ఆదేశించారు. అనంతరం మల్లేపల్లి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ బి.సురేఖ, బివి.విజయలక్ష్మి, జి.వెంకటశ్రీనివాస్, కె.గోపాలకృష్ణమూర్తి, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ కె.నరేష్, బి.సురేంద్ర పాల్గొన్నారు.

రాక్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - కరప

కరప అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో గురువారం మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఆర్ఎస్ రత్నాకర్ ఆధ్వర్యంలో రాక్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు గుబ్బల రామకృష్ణ అధ్యక్షతన సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణపై రాక్ మూమెంట్ ఉద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ ఉద్యమాన్ని కరప మండలం నుంచే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సేవా సంఘం స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హ్యాండ్ రైటింగ్‌పై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

విద్యార్థులకు ఆంధ్రాయిడింగ్ నేర్పించేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఎంఇఒ కెహెచ్.నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బి.అబ్రహం హన్స్ పాల్గొని శిక్షణ ఇచ్చారు.

త్రివర్ణ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సామర్లకోట

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం త్రివర్ణ స్కూల్ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందించారు. స్కూల్‌కు చెందిన విద్యార్థులంతా రూ.19,700, స్కూల్ యాజమాన్యం రూ.5,300 మొత్తం రూ.25 వేలను సీఎం సహాయనిధికి అందచేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ తోటకూర వెంకటేశ్వరరావు తెలిపారు.

నష్ట పరిహారాన్ని తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - కోటనందూరు

అధిక వర్షాల వల్ల నష్టపోయిన పేదలకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని రాష్ట్ర మాదిగ రక్షణ వ్యవస్థాపక అధ్యక్షులు ఆరుగుల మోషే డిమాండ్ చేశారు. గురువారం అల్లిపూడి, కోటనందూరు, పి.కొట్టం, కె.కొట్టం ప్రాంతాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణమే నష్ట పరిహారాన్ని చెల్లించాలని కోరారు.

నేటి నుంచి 'వేద-2కె24' టెక్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య 'వేద-2కె24' పేరిట రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభం కానుందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రతీ ఏడాది ఆదిత్యలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుచెప్పారు.

సంక్షిప్త వార్తలు

సైనిక్ స్కూల్‌లో వంశీకి సీటు

ప్రజాశక్తి - కోటనందూరు



వంశీ రాకేష్

మండలం ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన అన్నంరెడ్డి వంశీ రాకేష్ కనికిరి సైనిక్ స్కూల్‌లో సీటు సాధించాడు. జ్జాతీయ స్థాయిలో జరిరిగిన సైనిక్-2024 ప్రవేశ పరీక్షలో 300 మార్కు లకు గాను 254 మార్కులు సాధించి ఈ సీటును సాధించాడు. స్థానిక ఎవిఎం కోచింగ్ సెంటర్లో శిక్షణ తీసుకుని జాతీయస్థాయిలో సీటు సాధించడం పట్ల స్థానిక ప్రజలు, ప్రజాప్రతి నిధులు హర్షం వ్యక్తం చేశారు. ఎవిఎం సంస్థ డైరెక్టర్ అల్లు విష్ణుమూర్తి మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంత విద్యార్థులను జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, ఆర్ఎంఎస్, నవోదయ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చి నవోదయలో 6 సీట్లు, సైనిక్‌లో రెండు సీట్లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



దాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలకు రూ.20 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గదులకు దాత మాగాపు ఆనంద్ శాస్త్రి రూ. 20వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. పాఠశాల పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ విజ్ఞప్తితో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటుకు దాత ముందుకొచ్చి హెచ్‌ఎం యు.మీనామాధురికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా దాత ఆనంద్ శాస్త్రిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాలైన కాండ్రకోట, మరలావ గ్రామాల్లో నిరాశ్రయులైన 90 బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కందిపప్పు, ఆయిల్ ఒక కేజీ చొప్పున అందచేసినట్లు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విజయవాడ బరది బాధితుల కోసం చిన్నారులు విరాళాలను సేకరించారు. గురువారం జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి గ్రామస్తులు వద్దకు వెళ్లి నష్టపోయిన వరద బాధితులు ఆదుకోవడానికి తోచిన సహాయం అందించాలని చిన్నారులు అభ్యర్థించారు. చిన్నారుల సహృదయానికి స్పందించి పలువురు ముందుకొచ్చి తోచిన సహాయాన్ని అందించారు.